క్లుప్తంగా

మహిళలకు ఆటల పోటీలు



దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ఇల్లెందు: ఇల్లెందు సింగరేణి స్కూల్‌లో మంగళవారం మహిళలకు దీపాలంకరణ పోటీలు నిర్వహించారు. సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు నిమ్మి ఆనంద్ మాట్లాడుతూ... 23న జరగనున్న సింగరేణి ఆవిర్భావ వేడుకలలో విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. డీజీఎం పర్సనల్ జీవీ మోహన్ రావు, పర్సనల్ ఆఫీసర్ సాయి స్వరూప్, హెచ్ఎం సుధాకర్, సెక్రెటరీ విజయ పాల్గొన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి డే సందర్భంగా సింగరేణి కార్పొరేట్ ఏరియాలోని ప్రకాశం స్టేడియంలో మంగళవారం మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏజీఎం పర్సనల్ (వెల్ఫేర్) కోడూరి శ్రీనివాస్‌రావు హాజరయ్యారు. విజేతలకు 23న జరిగే సెంట్రల్ ఫంక్షన్‌లో బహుమతులు అందజేయబడతాయన్నారు.

చెస్ పోటీల్లో ఘనత



బహుమతి అందజేస్తున్న అధ్యాపకులు

కొత్తగూడెంఅర్బన్: ఈనెల 18న వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో జరిగిన చదరంగం పోటీలో కొత్తగూడెంలోని ప్రియదర్శిని కళాశాల విద్యార్థి, బీఎస్సీ ద్వితీయ సంవత్సరం గణేష్ ప్రథమ స్థానంలో నిలిచి ఆలిండియా యూనివర్సిటీకి ఎంపికైట్లు కళాశాల కరస్పాండెంట్ కాటేపల్లి నవీన్‌బాబు తెలిపారు. మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో గణేష్‌ను అభినందించారు. శ్రీరామనేని చలపతిరావు, షేక్ నయీం, రాయల వివేక్, కాశిమల్ల రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వచ్చేనెల 12న చలో పార్లమెంట్



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): అందరికీ ఉచిత విద్య, ఉపాధి కల్పనకై 16 విద్యార్థి సంఘాలు జనవరి 12న చలో పార్లమెంట్ చేపట్టామని, ఆదేవిధంగా ఈనెల 18 నుంచి 31 వరకు ఎస్ఎఫ్ఐ అవిర్భావ వేడుకలు నిర్వహించనున్నామని ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు గార్లపాటి పవన్, కార్యదర్శి బుర్ర వీరభద్రం అన్నారు. మంగళవారం కొత్తగూడెంలోని మంచికంటి భవన్‌లో జరిగిన ఎస్ఎఫ్ఐ ముఖ్యకార్యకర్తల సమావేశంలో వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని యూనియన్లు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కోలిండియా పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ



పవన్‌ను సన్మానిస్తున్న కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): కోలిండియా పవర్ లిఫ్టింగ్ పోటీలో మూడో బహుమతి సాధించిన వీకే -7 ఉద్యోగి పిల్లి పవన్‌ను వీకే-7 షాఫ్ట్ గని మేనేజర్ జర్పలా శంకర్ ఆధ్వర్యంలో మంగళవారం ఉద్యోగులు, అధికారులు, కార్మికులు ఘనంగా సన్మానించారు. బోరింగ్ శంకర్, గోదావరి శ్రీనివాస్, అఖిలాస్, సర్వేయర్ ఓం ప్రకాశ్, కోటేశ్వర్‌రావు, కుమార్ రావు, సురేష్, ప్రసాద్, వెంకన్న, డేవిడ్ పాల్గొన్నారు.

కేటీపీఎస్‌లో సెమీ క్రిస్మస్



కేక్ కట్ చేస్తున్న సీఈ ప్రభాకర్‌రావు

పాల్వంచ: స్థానిక కేటీపీఎస్ 5,6 దశల కర్మాగారంలోని ఎంసీఆర్ హాల్‌లో మంగళవారం సెమీ క్రిస్మస్ నిర్వహించారు. సీఈ ఎం.ప్రభాకర్‌రావు కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. పాస్టర్ డి.అభిషేక్, ఎస్ఏఓ జార్జ్, గీతా విజయలక్ష్మి, సర్వశ్రీ, నాగయ్య పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు నూకల రంగారావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. పాస్టర్ ప్రేమ్‌దాస్, యోహాన్, భూషణం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పంజా విసురుతున్న చలి

- రోజురోజుకూ పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- పెరుగుతున్న చలి తీవ్రత
- ఉదయాన్నే బయటికి వెళ్లేందుకు జంకుతున్న జనం



ఇల్లెందు మండలంలో చలిలోనే వరికుప్ప కొడుతున్న కూలీలు

సుజాతనగర్/ఇల్లెందురూరల్: జిల్లాలో చలి తీవ్రత పెరుగుతోంది. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పడిపోతుండగా చలిగాలుల ప్రభావంతో ఉదయం 9 గంటల వరకు కూడా రోడ్లపై జనం, వాహనాలు కనిపించడం లేదు. పొగమంచుతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. గత పది రోజులుగా చలిగాలులు వీస్తుండడంతో వృద్ధులు, చిన్నారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. చలి బారి నుంచి తప్పించుకునేందుకు చలి మంట కాగడంతో పాటు స్వెట్టర్లు, మఫ్లర్లు ధరిస్తున్నారు. సాయంత్రం ఐదు గంటల నుంచే చలి మొదలవుతుండటంతో త్వరగా ఇళ్లకు చేరుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. వ్యాపారస్తులు సైతం త్వరగా దుకాణాలు మూసివేసి ఇళ్లకు చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఏదైనా పని ఉంటే తప్ప బయటికి రావటం లేదు. వాహనదారులు ఉదయం, సాయంత్రం వచ్చే పొగమంచుతో ఇబ్బందులు పడుతున్నారు. ఉదయాన్నే పనులకు వచ్చే పారిశుద్ధ్య కార్మికులు, పాల వ్యాపారులు, మార్నింగ్ వాక్ చేసేవారు కాస్తా ఆలస్యంగా బయటకు వస్తున్నారు. ఇటీవల వచ్చిన తుపాన్ ప్రభావంతో చలి తీవ్రత పెరిగిందని వాతావరణ నిపుణులు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్వెట్టర్లు, ఉన్నిదుస్తుల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.

జాగ్రత్తలు తప్పనిసరి...

ఇప్పటికే జలుబు, దగ్గు ఉక్కిరి బిక్కిరి చేస్తుండగా ఇప్పుడు చలి తోడవడంతో ఆస్పత్రులకు బాధితుల సంఖ్య పెరిగింది. చలికాలంలో ఎక్కువగా చర్మవ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. చలి నుంచి వీలైనంతవరకు దూరంగా ఉండాలంటున్నారు. చలికాలంలో దద్దుర్లు, చర్మం పగుళ్లు వస్తాయని ఎక్కువగా మంచినీరు తాగాలని, ఆస్తమా ఉన్నవారు చలిగాలులకు మరింత దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. వేకువ జామునే బయటికి వెళ్లాల్సి వస్తే తప్పనిసరి చర్మాన్ని పూర్తిగా కప్పుకొనేలా జాగ్రత్తలు తీసు కోవాలని తెలిపారు. సరైన పౌష్టికాహారం తీసుకోవాలని చెబుతున్నారు.

పిల్లలకు ఆహారం...

చలికాలంలో పిల్లల ఆహారం విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా వ్యవహరించాలి. ముఖ్యంగా పోషక విలువలు కలిగిన ఆహారం మూడు పూటలా పిల్లలు తీసుకునేలా చూడాలి. భోజనం వేడివేడిగా తాజాగా ఉండేలా చూడాలి. ఫ్రిజ్‌లో పెట్టినవి వేడి చేసి ఇవ్వకూడదు. భోజనంలో కూరగాయలు, ముఖ్యంగా దుంపకూరలు ఉండేలా చూసుకోవాలి. క్యారెట్, బీట్‌రూట్, బంగాళదుంప, చిలకడదుంప, మొదలైన దుంపలను కూరగా లేదా ఉడికించి పెట్టాలి. ఇవి పిల్లల్లో మలబద్ధకాన్ని పోగొట్టి ఫైబర్, రోగనిరోధక శక్తిని పెంచే విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లను అందజేస్తాయి.

పిల్లల విషయంలో జాగ్రత్తలు ఇలా...

- నెల వయసున్న పిల్లలను తల్లి పొత్తిళ్లలోనే ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి
- చిన్న పిల్లలను నీటిలో ఆడకుండా, తడవకుండా చూసుకోవాలి.
- వీలైనంత వరకు సాయంత్రం 6 గంటలు దాటిన తరువాత బయట ప్రయాణాలు మానేయాలి.
- జ్వరం, దగ్గు, జలుబు వంటి ట్యాబ్లెట్లను అందుబాటులో ఉంచుకోవాలి.
- ఇంట్లో వండుకున్నవి, వేడివేడి ఆహార పదార్థాలనే తీసుకోవాలి.
- శీతల పానీయాలు, చాక్లెట్లు, స్వీట్లకు దూరంగా ఉంచాలి. వీటి వల్ల త్వరగా జలుబు వస్తుంది.
- రోగనిరోధక శక్తి పెంచే తాజా కూరగాయలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి.

చలి.. చంపేస్తోంది..

చలి.. పులి అయింది.. గజగజ వణికిస్తోంది.. ఎవరి నోట విన్నా వామ్మో ఇంత చలా.. చంపేస్తోందండీ.. అంటూ వాపోతున్నారు. ఉదయం ఎనిమిది గంటలు దాటినా రహదారులపైకి పిల్లికూన కన్పించడం లేదు. సాయంత్రం అయిదు గంటల్లోపే గూటిలోకి చేరుకుని ముసుగుతన్ని పడుకుంటున్నారు. ఏ ఊరిలో, ఏవీధిలో చూసినా ఉదయం చలిమంటలే. కాస్తా పొద్దెక్కితే ఎండలో కూర్చుంటున్నారు. ఇంతటి చలి తీవ్రతతో రెక్కాడితే కానీ డొక్కాడని ప్రజలు.. ఆ చలి తీవ్రతను తట్టుకుంటూ తమ జీవనయానం కొనసాగిస్తున్నారు.



చలికి వణుకుతూ ఇల్లెందు మీదుగా ట్రాలీలో పనులకు వెళ్తున్న మహిళలు

జాగ్రత్తగా ఉండాలి



చలికాలంలో జాగ్రత్తలు పాటించాలి. ఉష్ణోగ్రతలు తగ్గుతున్న కొద్దీ వాతావరణ మార్పులతో వ్యాధులు అవకాశం ఉంది. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి ఫ్లూ వస్తుంది. ఈ వ్యాధిగ్రస్తులు తరచూ ముక్కు, చెవులు, కళ్లను తాకడం మానేయాలి. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు, వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి.

– జేవీఎల్.శిరీష, డీఎంహెచ్ఓ

ఆరోగ్యంపై అశ్రద్ధ వద్దు



పిల్లలను ముఖ్యంగా రెండేళ్లలోపు చిన్నారులను ఎప్పుడూ వెచ్చగా ఉండేలా చూడాలి. శీతలగాలుల కారణంగా చిన్నారుల్లో ఈ మధ్య న్యూమోనియా కేసులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. పిల్లల్లో జ్వరం, జలుబు, దగ్గు లక్షణాలుంటే వైద్యుడిని సంప్రదించాలి. చిన్నారులను చలిలో తిరగనివ్వడం, తిప్పడం వంటివి చేయకూడదు.

– ఎం.రాధామోహన్, పిల్లల వైద్య నిపుణులు, కొత్తగూడెం

షాపులకు బహిరంగ వేలం



వేలం నిర్వహిస్తున్న అధ్యక్షుడు, ఈఓ

పాల్వంచ: శ్రీకనకదుర్గ దేవస్థానం (పెద్దమ్మగుడి)లో మంగళవారం పలు షాపులకు బహిరంగ వేలంపాట నిర్వహించారు. ఈఓ రజనీకుమారి, కొత్తగూడెం డివిజన్ పరిశీలకులు పి.భేల్‌సింగ్, ధర్మకర్త మండలి సభ్యుల సమక్షంలో ఆలయ ఆవరణంలోని నూతన షాపింగ్ కాంప్లెక్స్‌లోని షాపులకు వేలం నిర్వహించారు. షాపు నంబర్ 1కి నలుగురు పోటీపడగా గాయత్రి రూ.22వేలకు, షాప్ నంబర్ 2కు నలుగురు పోటీ పడగా గాంధీ రూ.30వేలకు, షాప్ నంబర్ 9కు ముగ్గురు పోటీ పడగా ఐ.వెంకటప్పయ్య రూ.10,200, షాప్ నంబర్ 12కు ముగ్గురు పోటీపడగా టి.రాజేశ్వరి రూ.30,500 వేలం ద్వారా దక్కించుకున్నారు. అదేవిధంగా షాపు నంబర్ 3,5,6,7,10,11 షాపులకు ఎవరూ రాకపోవడంతో 26వ తేదికి వాయిదా వేశారు. ధర్మకర్తల మండలి అధ్యక్షులు మహిపతి రామలింగం, సభ్యులు ఎస్‌వీఆర్‌కే ఆచార్యులు, సందపట్ల శ్రీనివాసరెడ్డి, కిలారు నాగమల్లేశ్వరరావు, మలోతు సువాలి, వెంగళరావు, లక్ష్మీనారాయణ, వెంకటరామారావు, పాపయ్య దొర, ఎక్స్‌అఫిషియో మెంబర్ రవికుమార్ పాల్గొన్నారు.

నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యం చేయొద్దు

టేకులపల్లి: గ్రామాల్లో పచ్చదనం పెంపొందించేందుకు మొక్కలను పెంచే నర్సరీల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని టేకులపల్లి ఎంపీడీఓ కోట వీరబాబు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం బేతంపూడి గ్రామ పంచాయతీతో పాటు పలు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా ఏర్పాటు చేసిన నర్సరీలను తనిఖీ చేశారు. బ్యాగుల్లో మట్టి నింపడం, విత్తనాలు నాటడం పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నాటిన విత్తనాలు ఆరోగ్యంగా పెరిగేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీఓ కాళంగి శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ చాంద్మల్, ఫీల్డ్ అసిస్టెంట్ వీరభద్రం పాల్గొన్నారు.




నర్సరీని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ వీరబాబు

ఎమ్మెల్యే కూనంనేనికి శుభాకాంక్షలు


సింగరేణి(కొత్తగూడెం): ఎమ్మెల్యే కూనంనేని సాంబశివారావును ఆయన స్వగృహంలో కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలెంరాజు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ.. కొత్తగూడెం ఏరియాలోని వీకే-7 ఓసీ అనుమతులు ఎక్కడి వరకు వచ్చాయని, జీకే ఓసీలో బొగ్గు నిక్షేపాల పరిస్థితి, రాంపురం గనిలో ఉన్న బొగ్గు నిక్షేపాల వివరాలపై జీఎంతో చర్చించారు. అదేవిధంగా ఏరియాలో అభివృద్ధి పనులపై చర్చించారు. ఏరియా అభివృద్ధికి యాజమాన్యం తీసుకోబోతున్న వివిధ అంశాలపై జీఎంను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఓటూ జీఎం జీవీ కోటిరెడ్డి, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ డి.రమణారెడ్డి, ఎస్టేట్స్ ఆఫీసర్ తావుర్యానాయక్, ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాల్వంచ: కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును పాల్వంచ ముస్లిం వెల్ఫేర్ సొసైటీ సభ్యులు సోమవారం సాయంత్రం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కూనంనేని ద్వారా నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌కే.ఖాజావియా, వైస్ ప్రెసిడెంట్ ఎండీ.ముర్తుజా అలీఖాన్, గౌస్ పాషా, వెంకటరత్నం పాల్గొన్నారు.

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన క్రీడా సంఘాల ప్రతినిధులు పి.కాశీహుస్సేన్ (జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్) ఇ.మొగిలి (జిల్లా తైక్వాండో అసోసియేషన్), కే.కృష్ణారావు (జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్)ల ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువతో సన్మానించారు.



ఎమ్మెల్యే కూనంనేనికి శుభాకాంక్షలు తెలుపుతున్న జీఎం శాలెంరాజు



కూనంనేనిని సన్మానిస్తున్న క్రీడా సంఘాల ప్రతినిధులు

జాతీయ సమైక్యతే దేశాభివృద్ధికి బాట

సింగరేణి(కొత్తగూడెం): జాతీయ సమైక్యతే అభివృద్ధికి బాటని, విద్యార్థుల్లో జాతీయ సమైక్యత భావాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో సర్వమత పండుగలను ఉమ్మడిగా పాఠశాలలో నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు డాక్టర్ ప్రభుదయాళ్ అన్నారు. మంగళవారం రామవరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు, క్రిస్మస్ పండుగ నూతన వస్త్రాలు అందజేశారు.

ఆర్థిక సాయం

పాల్వంచ: మండలంలోని కిన్నెరసాని గ్రామ పంచాయతీ గ్రీన్ అంబాసిడర్‌గా పనిచేస్తున్న వజ్జా సమ్మక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె కుటుంబానికి మంగళవారం పంచాయతీ తరుపున రూ.10వేల ఆర్థిక సాయాన్ని ఎంపీఓ నారాయణ, సర్పంచ్ వీరకుమారి అందించారు.

కార్మికులకు జీతాలు ఇప్పించండి

ఇల్లెందు: మున్సిపల్ కార్మికులకు రెండు నెలలుగా వేతనాలు అందడంలేదని, 13 నెలలుగా బకాయిలు విడుదల చేయలేదని, గత సీఎం మేడే కానుక ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉందని, తక్షణం కార్మికుల సమస్యలు పరిష్కరించి ఆదుకోవాలని ఇఫ్టూ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు యాకుబ్ షావలీ కోరారు. మంగళవారం ఎమ్మెల్యే కోరం కనకయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కుమార్, శంకర్, వెంకటేశ్వర్లు, రవి, వీరస్వామి, శ్రీను, మైబురెడ్డి, దాసు, శ్రీకాంత్, అనిల్ పాల్గొన్నారు.

ఆదివాసీలకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు అందజేస్తున్న ఆస్పత్రి సిబ్బంది

పాల్వంచ: అమృత ఆస్పత్రి ఆధ్వర్యంలో గిరిజన గ్రామంలో ఆదివాసీలకు దుప్పట్లు పంపిణీ చేశారు. మంగళవారం యానంబైల్ పంచాయతీ పరిధిలోని సారేకల్లు దగ్గర ఉన్న పలు కుటుంబాలకు ఎండీ బాబూరావు, ఐడీసీసీ డాక్టర్ జయ, హ్యాపీ టూ హెల్ప్ యూ ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ జయ దుప్పట్లు, పిల్లలకు తినుబండారాలు అందజేశారు.

సింగరేణి కార్మికులకు అండగా ఉంటా..

ఇల్లెందు: వచ్చే సింగరేణి ఎన్నికల్లో గుర్తింపు సంఘంగా ఐఎన్‌టీయూసీని గెలిపించాలని, ప్రతీ కార్మికుడికి అండగా ఉంటానని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మంగళవారం ఇల్లెందు జేకే ఓసీలో జరిగిన ఫిట్ మీటింగ్‌లో కనకయ్య మాట్లాడారు. గుర్తింపు ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీని గెలిపించటం ద్వారా ప్రభుత్వ మద్దతు ఉంటుందని తెలిపారు. రానున్న కాలంలో కష్టాల్లో ఉన్న ఇల్లెందు బొగ్గు పరిశ్రమను అటు ప్రభుత్వం ఇటు ఐఎన్‌టీయూసీ మాత్రమే రక్షించగలదన్నారు. ప్రతీ కార్మికుడు ఈ ఎన్నికల్లో తన ఓటును ఐఎన్‌టీయూసి వేసి ఆదరించాలని, కార్మికుల సమస్యలను పరిష్కరించుకునే శక్తి అందించాలని కోరారు. ఈ సందర్భంగా వివిధ యూనియన్ల నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులు ఐఎన్‌టీయూసీలో చేరారు. వారికి ఐఎన్‌టీయూసీ కండువాలు కప్పి ఆహ్వానించారు. దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, ఎస్‌కె జానీ, లింగాల జగన్నాథం, మహబూబ్, కళ్లం కోటిరెడ్డి, దొడ్డా డానియేల్, బోలా, కుడితి శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.



ఐఎన్‌టీయూసీలో చేరిన వారితో ఎమ్మెల్యే కోరం, దమ్మాలపాటి వెంకటేశ్వరరావు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలోని ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో టీబీజీకేఎస్ బ్రాంచి సెక్రటరీతో పాటు 10 మంది మంగళవారం ఐఎన్‌టీయూసీలో చేరారు. వారికి కండువాలు కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు ఆల్బర్ట్, సీహెచ్ రాయమల్లు, ఖుర్షీద్ అలీ, వినయ్, యాదగిరి, పాక ప్రసాద్, నరేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

సుజాతనగర్: మండలంలోని రాఘవాపురం గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మి మద్దతు ధర పొందాలన్నారు. కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, సొసైటీ చైర్మన్ మండె వీరహనుమంతరావు, తహసీల్దార్ జి.శిరీష, ఎంపీడీఓ వెంకటలక్ష్మి, ఎంపీటీసీ మానస, సర్పంచ్ కృష్ణవేణి, ఆర్ఐ ఎం.కాంతారావు పాల్గొన్నారు.

శెట్టిబలిజ కులాన్ని బీసీల్లో చేర్చాలి

సింగరేణి(కొత్తగూడెం): శెట్టిబలిజ కులాన్ని బీసీ కులాల్లో చేర్చాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివారావుకు శెట్టిబలిక కులస్తులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మా తాతముత్తాతలు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి కొత్తగూడెం, రామవరం తదితర ప్రాంతాలలో స్థిరపడ్డారని, ఈనేపథ్యంలో తెలంగాణ రాక ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉంటూ బీసీ కులస్తులుగా సర్టిఫికెట్లు పొంది తమ పిల్లలకు అన్నిరకాల సదుపాయలు పొంది ఉన్నామని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఆంధ్రా కులాలు అని 26 బీసీ కులాలను గత ప్రభుత్వం జాబితా నుంచి తొలగించటం జరిగిందన్నారు. దీని వలన తమ కులస్తులు ఆంధ్రలో బీసీలుగాను, తెలంగాణలో ఓసీలుగాను పరిగణిస్తున్నారని, దాని వలన ప్రభుత్వం నుంచి ఎటువంటి రాయితీలు పొందలేక పోతున్నామని, అంతేకాకుండా తమ పిల్లలకు రావాల్సిన రాష్ట, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు రాక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాటి మోహన్‌రావు, చప్పిడి రాదకృష్ణ, చల్లంగి శ్రీనివాసరాజు, పితాని శ్రీనివాస్, గుత్తుల శ్రీనివాస్, గుత్తుల జగదీశ్, గెద్దాడ సత్యనారాయణ, పాటి ఈశ్వరరావు, గెద్దాడ పుల్లయ్యశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఇప్పుడెలా హామీలు అమలు చేస్తారు?



మాట్లాడుతున్న జీఎల్‌బీకేఎస్ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు ఇప్పటికి ఆరుసార్లు జరగగా.. ఈ ఆరుసార్లు అమలు చేయని హామీలు ఇప్పుడెలా చేస్తారని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయు), గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం (జీఎల్‌బీకేఎస్) జాతీయ నాయకులు సాధినేని వెంకటేశ్వరరావు, యూనియన్ గౌరవాధ్యక్షులు టి.శ్రీనివాసులు ప్రశ్నించారు. మంగళవారం కొత్తగూడెం ఏరియాలో పరిధిలోని జీకేఓసీ, పీవీకే-5షాఫ్ట్ గనిలో ఏర్పాటు చేసిన పిట్ సమావేశంలో వారు మాట్లాడారు. ఇప్పటి వరకు గుర్తింపు సంఘంగా గెలిచిన సంఘాలన్నీ కార్మికుల హక్కులను తుంగలో తొక్కారని, ఇప్పుడు కార్మికుల వద్దకు వచ్చి ఓట్లు అడుగుతున్నారని విమర్శించారు. సింగరేణి స్థలంలో సింగరేణి సొమ్ముతో, సింగరేణి బొగ్గుతో విద్యుదుత్పత్తి చేసే సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రంలో సింగరేణి ఉద్యోగులు లేకపోవటం సిగ్గుచేటని, ఏ నాయకుడు దీనిపై యాజమాన్యాన్ని ప్రశ్నించడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా కార్మికవర్గం ఆలోచించి కార్మికుల తరుపున కొట్లాడి సింగరేణి పరిరక్షణకై ఉద్యమించే, మూడు విప్లవ సంఘాలు బలపరుస్తున్న విప్లవ కార్మిక సంఘాల యూనియన్ జీఎల్‌బీకేఎస్ గుర్తు.. చక్రంలో సుత్తి గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీతారామయ్య, గౌని నాగేశ్వరరావు, ఎల్.విశ్వనాథం, డి.ప్రసాద్, కాపు కృష్ణ, సంజీవరావు, మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఇది ప్రజా ప్రభుత్వం..



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కొత్తగూడెంరూరల్: నియోజకవర్గ స్థాయిలో పాల్వంచ కాంగ్రెస్ పట్టణ కమిటీకి తప్ప ఏ ఇతర కమిటీలు లేవని, నియోజకవర్గంలో బి బ్లాక్ పీసీసీ మెంబర్ మాజీ ఎమ్మెల్యే టీపీసీసీ ఉపాధ్యక్షుడు పోట్ల నాగేశ్వరరావు అని టీపీసీసీ సభ్యుడు జేబీ శౌరీ, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ మోతుకూరి ధర్మారావు తెలిపారు. మంగళవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో అమ్ముడు పోయిన నాయకులు పదువులు లేకపోయినా పదవులు ఉన్నట్లు చెప్పుతున్నారని వారి మాటలు నమ్మొద్దన్నారు. ఉమ్మడి జిల్లాలో తొమ్మిది అసెంబ్లీ సీట్లు గెలిపించినందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో అధికారులు ఇంకా బీఆర్ఎస్ ఫోబియాలో ఉన్నారని, వారు ఇప్పటికైనా ఆ మత్తు వీడకపోతే, ప్రభుత్వం వారిపై చర్యలు తీసుకుంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమ కోసం నిరంతరం కృషి చేస్తుందని, దీనిలో భాగంగానే రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతోపాటు, రైతులకు రైతుబంధు డబ్బులు జమ చేయటం జరుగుతోందన్నారు. ఎండీ గౌసుద్దీన్, అల్లాడి నరసింహారావు, గద్దం రాజశేఖర్, అజ్మీర సురేష్ నాయక్, దావూద్ షేక్ షబానా, ఎలకపల్లి లక్ష్మయ్య, సురేష్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కనకయ్యకు సన్మానం



ఇల్లెందురూరల్: ఎమ్మెల్యే కనకయ్యను సన్మానిస్తున్న సెర్ప్ అధికారులు



టేకులపల్లి: కోరం కనకయ్యను సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

ఇల్లెందురూరల్: సబ్‌డివిజన్ పరిధిలోని ఐదు మండలాలకు చెందిన సెర్ప్ అధికారులు మంగళవారం ఎమ్మెల్యే కోరం కనకయ్యను ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. సెర్ప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ.. పొదుపు సంఘాల ఆర్థికాభివృద్ధికి అధికారులు కృషి చేయాలని సూచించారు. దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, దుర్గారావు, రవికుమార్, సుభాష్, నరేందర్, నర్సింహారావు పాల్గొన్నారు.

1వ తేదీనే జీతాలు ఇవ్వండి..

టేకులపల్లి: ప్రభుత్వ ఉపాధ్యాయులకు ప్రతీనెల 1వ తేదీనే జీతాలు ఇవ్వాలని పీఆర్‌టీయూ టేకులపల్లి మండల అధ్యక్షుడు గుగులోత్ మోతీలాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, నాయకులు క్యాంపు కార్యాలయంలో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలపై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలను అమలుపరుస్తూ సీపీఎస్‌ను రద్దు చేయాలని, 317 జీఓ బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, 40శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలతో పాటు, అన్నిరకాల పెండింగ్ బిల్లులను వీలైనంత త్వరగా క్లియర్ చేయాలని, ఐటీడీఏ ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ చేపట్టడంతో పాటు పెండింగ్ సమస్యలను పరిష్కారమయ్యేందుకు సీఎం దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. నర్సయ్య, టి.రవీందర్, రమేష్ బాబు, ప్రసాద్, విజయనిర్మల పాల్గొన్నారు.

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని గాంధీపథం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనయ్యను సన్మానించారు. ఇల్లెందులో జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు గెర్షోము, రామలక్ష్మణులు పాల్గొన్నారు.